క్లుప్తంగా

కర్పూరీ ఠాకూర్‌కు ఘన నివాళి



మంగళగిరి: పేద, బడుగుల ఆరాధ్య దైవం కర్పూరీ ఠాకూర్ అని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు కొనియాడారు. నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం బిహార్ మాజీ సీఎం, భారతరత్న కర్పూరీ ఠాకూర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కర్పూరీ ఠాకూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ సాధారణ పేద కుటుంబంలో పుట్టిన ఠాకూర్ అంచంచలుగా ఎదిగి రెండు సార్లు బిహార్ ముఖ్యమంత్రిగా పని చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పారేపల్లి మహేష్ పాల్గొన్నారు.

జలపాలేశ్వరుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వర స్వామి ఆలయంలో మాఘ శుద్ధ పంచమిని పురస్కరించుకొని సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఉమాపతి శాస్త్రి స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, అష్టోత్తర, సహస్రనామ పూజలు బిల్వదళాలతో చేశారు. అనంతరం నమక చమకాలతో జలాభిషేకాలు నిర్వహించి అర్చనలు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మల కాన్వెంట్ సమీపంలోని స్క్రాప్ వ్యాపార సంస్థలో సోమవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఆకస్మికంగా మంటలు రావడంతో వెంటనే యజమాని బాపనపల్లి ఏడుకొండలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను సిబ్బంది అదుపులోకి తీసుకువచ్చారు. ఆకతాయిలు సిగరెట్ తాగి పడేయడం వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు తెలిపారు.

ఉర్దూ స్కూల్స్‌ను యథావిధిగా కొనసాగించాలి

దుగ్గిరాల: రాష్ట్రంలో ఉన్న ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.సుభానీ కోరారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు తక్కువగా ఉన్నారనే సాకుతో స్కూళ్లను మూసివేసి, వేరే స్కూళ్లలో విలీనం చేయడం సరికాదన్నారు. గుంటూరు జిల్లాలో 120, రాష్ట్ర వ్యాప్తంగా 1,390 ఉర్దూ పాఠశాలలు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉర్దూ బాషా వాట్సాప్ గవర్నెన్స్‌లో కూటమి ప్రభుత్వం పెట్టకపోవడం భావ్యం కాదన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి సముచిత స్థానం కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రాష్ట్రంలో తెలుగు బాషా తర్వాత ఉర్దూకి గత ప్రభుత్వంలో రెండోవ స్థానం ఇచ్చి పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు నాడు–నేడు పథకం కింద అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



మేడికొండూరు: గుంటూరు జిల్లా స్థాయిలో జరిగిన అండర్ – 14 బాలుర ఫుట్ బాల్ క్రీడా పోటీల్లో కొర్రప్రాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంపాల రమేష్ కుమార్ సోమవారం తెలిపారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శివ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మేడికొండూరు : మండల పరిధిలోని డోకిపర్రు గ్రామంలో సాగర్ కుడి కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు మేడికొండూరు పోలీసులు సోమవారం తెలిపారు. మృతుని వయస్సు సుమారుగా 42 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని వెల్లడించారు. వీఆర్వో వెంకట్రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భౌ..భౌ.. లేదిక భయం

- వీధి కుక్కల బెడద నియంత్రణకు కార్పొరేషన్ చర్యలు
- కాజలో కుటుంబ నియంత్రణ, యాంటీ రేబిస్ సెంటర్ ఏర్పాటు
- శునకాలకు ఆపరేషన్‌లు చేయిస్తున్న అధికారులు
- తీరనున్న నగరవాసుల ఆందోళన



కాజలో ఏబీసీ అండ్ డాగ్ స్టెరిలైజేషన్ అండ్ యాంటీ రేబిస్ సెంటర్

మంగళగిరి: ఏ వీధిలోకి వెళ్తే.. ఎక్కడ పిక్క పట్టుకుంటుందనే భయం.. బైక్ హారన్ మోగితే ఎటు నుంచి వస్తాయోనని గుండె దడ.. చీకటి పడిందంటే ఏ సందులో నుంచి వస్తాయోననే బెరుకు.. చిన్న పిల్లలు ఏమైనా తినుబండారాలతో కనిపిస్తే ఎక్కడ పట్టుకుని వెళ్తాయోననే ఆందోళన.. ఇదీ మంగళగిరి నగర ప్రజలు వీధి కుక్కల బెడదతో పడుతున్న వేదన. ప్రస్తుతం మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ(ఎంటీఎంసీ) పరిధిలో నెలకు సుమారు 30 మంది కుక్క కాటుకు గురవుతున్నారు. గ్రామ సింహాల భయం నుంచి ప్రజలకు విముక్తి కల్గించేందుకు.. మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. శునకాల నియంత్రణతో పాటు వాటిని ఒక షెడ్డులో ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రేబిస్ వ్యాక్సిన్ సిద్ధం చేయడంతో పాటు కుక్కల సంతానోత్పత్తికి బ్రేకులు వేసేందుకు కార్పోరేషన్ అధికారులు సిద్ధమయ్యారు.

వీధి కుక్కల బెడద తప్పినట్లే..

ఇందులో భాగంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించేందుకు నగర పరిధిలోని కాజలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏబీసీ అండ్ డాగ్ స్టెరిలైజేషన్ యాంటీ రేబిస్ సెంటర్‌ను ఏర్పాటు చశారు. ఇక్కడ పట్టుకొచ్చిన కుక్కలను ఉంచేందుకు షెడ్డు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసేందుకు గదులు ఏర్పాటు చేశారు. నగర పరిధిలోని సుమారు 4 వేల కుక్కులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కుక్కలను తీసుకెళ్లి రెండు రోజుల పాట అక్కడే ఉంచి ఆపరేషన్లు చేయిస్తున్నారు. మళ్లీ మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి వాటిని ఎక్కడైతే పట్టుకున్నారో అక్కడే వదిలేసేలా చర్యలు తీసుకుంటున్నారు. రోజుకు పది కుక్కలకు తగ్గకుండా ఆపరేషన్ చేయించేందుకు అనుగుణంగా షెడ్డు వైద్యులు అందుబాటులో ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు చేసి శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టారు.



ఆపరేషన్ కోసం తెచ్చిన శునకం

సంతానోత్పత్తి నియంత్రణ చర్యలు



నగరంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఫిర్యాదులు అందుతున్నాయి. కుక్కలను చంపడం, అడవుల్లో వదిలిపెట్టడం నేరం. వాటికి కుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించడం ద్వారా ఉత్పత్తిని తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో ప్రజలు కుక్కలతో ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

–అలీం బాషా కమిషనర్, ఎంటీఎంసీ



కుక్కలను తీసుకెళ్తున్న సిబ్బంది

ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

అడిషనల్ కమిషనర్ శకుంతల



మంగళగిరి టౌన్ : ఎంటీఎంసీ పరిధిలోని 5 సచివాలయాల్లో మంగళవారం నుంచి 21వ తేదీ వరకు, తదుపరి 24 నుంచి 28వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కె.శకుంతల సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళగిరి పట్టణ పరిధిలోని గండాలయ్యపేట, ద్వారకా నగర్, సూర్యనారాయణ నగర్, తాడేపల్లి పరిధిలోని ఉండవల్లి సెంటర్, కొలనుకొండ సచివాలయాల్లో ఈ ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సచివాలయ పరిధిలోని 0–6 సంవత్సరాలలోపు ఉన్నవారిని ఎన్‌రోల్‌మెంట్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయా సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు సచివాలయ వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రోసెసింగ్ కార్యదర్శి, వార్డు మహిళా పోలీసులు ప్రచారం నిర్వహించి ఆధార్ సేవలను వినియోగించుకునేలా ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. నూతన కార్డులు జారీ చేయడం, బయోమెట్రిక్, తప్పనిసరి మార్పులు, ఆధార్ సంబంధిత సర్వీసులను ఈ ప్రత్యేక ఆధార్ శిబిరాల్లో అందుబాటులో ఉంటాయని ఎంటీఎంసీ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ మొబైల్ క్యాంప్‌లు

దుగ్గిరాల: దుగ్గిరాల మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు జరిగే ఆధార్ మొబైల్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. గ్రామ సచివాలయాల్లో బయోమెట్రిక్, డెమోగ్రఫీక్స్‌లలో మార్పులు చేర్పులు, పేర్లు నమోదులో తప్పులు ఉంటే సరిచేసుకోవాలని తెలిపారు.

లక్ష్మణరావు గెలుపునకు ప్రచారం



తాడేపల్లిరూరల్ : కృష్ణా గుంటూరు నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజా సంఘాల నాయకులు సోమవారం విస్తృత ప్రచార కార్యక్రమాన్ని తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని మహానాడు, ఉండవల్లి జిల్లా పరిషత్ పాఠశాల, డోలాస్‌నగర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, ప్రజా సమస్యలపై శాసన మండలిలో తన గొంతును వినిపిస్తున్న లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, కాపవరపు రామకృష్ణ, బూరగ వెంకటేశ్వర్లు, బి.అంకయ్య, వై.యహోషువా, ఎం.చెన్నయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన నిర్వహిస్తున్న నాలుగు మండలాల అంగన్‌వాడీలు

ఫిరంగిపురం: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని తాడికొండ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు ఫిరంగిపురంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. మినీ సెంటర్లను ప్రధాన సెంటర్లుగా మార్పు చేస్తూ జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాక మెడికల్ లీవ్‌లో మూడు నెలల జీతం చెల్లించాలని, ధర్నాలో ఉన్న సమయంలో ఎవరైనా చనిపోతే వారికి మట్టి ఖర్చులు చెల్లించాలని కోరారు. అద్దె భవనాలకు నగదు పెంచాలని, గ్యాస్ సిలిండర్లు సప్‌లై చేయాలని, ఆగిన టీఏ, డీఏ నగదు బిల్లులు చెల్లించాలన్నారు. ఆగిపోయిన సూపర్‌వైజర్ పోస్టులు వెంటనే అర్హులైన వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సీడీపీవో పి.ప్రసూనకు అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు డి.ధనలక్ష్మి, సీతారాఘవ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నివేశన స్థలాల కోసం వినతి



దుగ్గిరాల: మండలంలోని చిలువూరు గ్రామస్తులు నివేశన స్థలాలు గ్రామంలోనే కేటాయించాలని తహసీల్దార్ ఐ.సునీతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కంఠంరాజు కొండూరు గ్రామంలో స్థలాలు కేటాయించిందన్నారు. అవి అన్ని నిరుపయోగంగా ఉన్నాయని, గ్రామంలోనే స్థల సేకరణ చేసి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కన్వీనర్ విజయ్‌మాదిగ, జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాదిగ, శ్రీనివాసరావు మాదిగ పాల్గొన్నారు.

వైభవంగా భద్రావతి సమేత భావనాఋషి స్వామి కల్యాణం



భద్రావతి సమేత భావనా ఋషి స్వామి

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు వీరభద్ర స్వామి ఆలయంలో సోమవారం భద్రావతి సమేత భావనాఋషి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పద్మశాలీయ సంఘం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. పెండ్లి కుమారుడిని చేయుట, విశ్వేశ్వర పూజ, పుణ్యాహ వచనం, అఖండ దీపారాధన, నవగ్రహ మండపారాధన శాంతి హోమం, 18 మంది దంపతులతో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామి వారి కల్యాణం అనంతరం ఆత్మకూరు పుర వీధుల్లో స్వామి వారి గ్రామోత్సవం మేళ తాళాలతో, కనక తప్పెట్లు, బాణసంచా కాల్పులతో వైభవోపేతంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

మంగళగిరి టౌన్ : మంగళగిరి లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థాన ఆవరణలో బుధవారం నుంచి శ్రీ రాధాకృష్ణ యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభం కానున్నదని కేంద్ర వ్యవస్థాపకుడు రాధాకృష్ణ యోగి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు వారాల పాటు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. యోగ సాధన ద్వారా మానసిక, శారీరక భయాందోళన, ఇతర రోగాల, దోషాలతో పాటు 72 రకాల దీర్ఘకాలిక వ్యాధులు మటుమాయం అవుతాయని పేర్కొన్నారు. ఈ శిబిరం ఉదయం 6 నుంచి 7.30గంటల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

న్యాయమూర్తికి సన్మానం




న్యాయమూర్తి రామకృష్ణ దంపతులకు సత్కారం

మంగళగిరి టౌన్ : మంగళగిరి కోర్టులో ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించి, పదోన్నతిపై వెళ్తున్న న్యాయమూర్తి రామకృష్ణకు ఆదివారం రాత్రి మంగళగిరి కోర్టు ప్రాంగణంలో మంగళగిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. రామకృష్ణ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రమేష్‌బాబు మాట్లాడారు. రామకృష్ణ న్యాయవాదులకు మార్గదర్శకంగా ఉంటూ మంగళగిరి ప్రాంత వాసుల మన్ననలు పొందారన్నారు. విధి నిర్వహణలో భాగంగా పదోన్నతిపై ఒంగోలు కోర్టు సీనియర్ సివిల్ జడ్జిగా వెళ్తున్నారని తెలిపారు. ఆయన ఎక్కడ ఉన్నా ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో సుఖంగా ఉంటూ భవిష్యత్తులో మరెన్నో పదవులను స్వీకరించాలని కోరారు. రామకృష్ణ తన ప్రయాణం గురించి చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శృంగారపాటి బాలమురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు శేఖర్‌బాబు, ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, సహాయ కార్యదర్శి తాతా సాంబశివరావు, సీనియర్ న్యాయవాదులు లంకా శివరామప్రసాద్, వాకా రామగోపాల్ గౌడ్, వెంకట ప్రసాద్, షౌఖత్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని కోరుతూ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష 76వ రోజుకు చేరుకుంది. వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. బి.అంకయ్య, ఎం.ఆశీర్వాదం, సారమ్మ, శారద, ఖాసిం, విజయ్ పీల్, ఉన్నిష, మాలిన్, బుజ్జి పాల్గొన్నారు.

నులి పురుగులతో అనారోగ్యం



ఫిరంగిపురం: పిల్లలకు నులి పురుగులతో పలు అనారోగ్య సమస్యలొస్తాయని డాక్టర్ శాంతి అన్నారు. ఫిరంగిపురం పీహెచ్‌సీ పరిధిలోని శిరంగిపాలెం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 103 మందికి షుగర్, బీపీ, థైరాయిడ్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి చిన్నారుల తల్లులకు నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు మింగించాలని చెప్పారు. దీనిద్వారా రక్తహీనత లేకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఏఎన్‌ఎం ఆనందకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి కల్యాణం



ఆలయంలో ప్రత్యేక పూజలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మెల్లెంపూడిలో వేంచేసిన సిద్ధి బుద్ధి సమేత మహా గణపతి దేవాలయ 19వ వార్షికోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, ద్వాదశ ఫలాభిషేకాలు, గణపతి హోమం, సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి దివ్య కల్యాణ ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించామని తెలిపారు. సుమారు 2 వేల మంది భక్తులకు అన్నదానం చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజా రామిరెడ్డి, దొంతిరెడ్డి వెంకట శివరామకృష్ణా రెడ్డి, కుర్రే మల్లారెడ్డి, దొంతిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఉయ్యూరు శివరామిరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తాడేపల్లి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

- మెల్లెంపూడి గ్రామంలో వేంచేసిన ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం 10వ వార్షికోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

పంటల పరిశీలన



రంగులతో తీర్చిదిద్దిన చిత్ర పటాలు

మంగళగిరి: పంటల సాగుపై అవగాహనతో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. సోమవారం నగర పరిధిలోని కాజలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. సాగు విధానాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామానికి సంబంధించిన వ్యవసాయ భూమి, పంటలు, నీటి వసతి, గ్రామ స్వరూప చిత్ర పటాన్ని, పలు వ్యవసాయ పంటల చిత్ర పటాలను రంగులతో అందంగా తీర్చిదిద్దారు. గ్రామంలోని శివాలయం వద్ద వ్యవసాయ కళాశాల విద్యార్థులు వేసిన వ్యవసాయ పంటలు చిత్రాలు రైతులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో కేఎల్‌యూ వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రత్నప్రసాద్, హెచ్‌డీ డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్లు రాజేశ్వర్, అన్వేష్, ఉదయ భాస్కర్, విద్యార్థులు మస్తాన్ వలి, నాగసాయి, శశాంక్, వంశీరెడ్డి, హరి సూర్య, ఆకాష్, సుకుమార్ , కిరణ్‌కుమార్, గోపిచంద్, రెహమాన్, శ్రావణ్‌సాయి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన యురోపియన్ బృందం



నూతక్కిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న యురోపియన్ బృందం

మంగళగిరి: రైతు సాధికార సంస్థ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం(ఏపీ సీఎన్ఎఫ్) ద్వారా అమలు చేస్తున్న ఏటీఎం(ఎనీ టైమ్ మనీ) మోడల్ తమను ఆకట్టుకుందని , రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచే విషయంలో ఈ నామూనా గేమ్ ఛేంజర్‌గా పని చేస్తుందని యురోపియన్ ప్రతినిధి బెన్నెడిక్ట్ హెర్లిన్ ప్రశంసించారు. సోమవారం నగర పరిధిలోని నూతక్కి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని వారు పరిశీలించారు. జర్మనీ, కెన్యా దేశాల్లో 30 గ్లోబల్స్ ఫీల్డ్స్ ద్వారా ఆహార ఉత్పత్తి వల్ల కలిగే పర్యావరణ, సామాజిక ప్రభావాలపై ప్రజలకు అవగాహన ఈ బృందం అవగాహన కల్పిస్తోంది. ప్రపంచ ఆహార వ్యవస్థలు బాధ్యాతయుత వ్యవసాయ పద్ధతుల అవసరంపై అవగాహన పెంచడంలో భాగంగా పయనిస్తున్న ఏపీ సీఎన్ఎఫ్ విధానాలను అర్థం చేసుకునేందుకు ఈ బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. కుటుంబానికి అవసరమయ్యే ఆహార పదార్థాలు ఉత్పత్తికి 2 వేల చదరపు మీటర్ల వ్యవసాయ భూమి చాలు అనే భావనతో ముందుకెళ్తున్న ఈ బృందం పర్యటన నుంచి పరస్పర సహకారంతో జ్ఞానం పెంచుకోవడం ద్వారా కొత్త పద్ధతులను అమలు చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ బృందంలో ఫౌండేషన్ ఆన్ ఫ్యూచర్ ఫార్మింగ్ తరుపున జాస్పర్ జోర్డాన్, బెన్నెడిక్ట్ హెర్లిన్, పోర్చుగల్‌కు చెందిన ప్రాజక్టు ఎర్త్ ప్రతినిధి డియోగో కొటినో, అటెలియర్ ఫుడ్ సిస్టమ్ ఛేంజ్ ప్రతినిధి లూకాస్ కెష్లా ఉన్నారు. ఈ బృందానికి రైతు సాధికారిక సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం ఆరంభం నుంచి అమలయ్యే విధానం, విస్తరణ, సాధించిన ప్రగతి,అనుసరిస్తున్న వివిధ నమూనాలు గురించి క్షుణ్ణంగా వివరించారు. నూతక్కి గ్రామంలో పర్యటించి శ్రీనివాసరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న అరటి ఏ గ్రేడ్ నమూనాను పరిశీలించారు. అనంతరం దుగ్గిరాల మండలంలోని పెదకొండూరు గ్రామంలో దిలీప్ అనే రైతు శాస్త్రవేత్త పొలంలో ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్స్‌ను పరిశీలించింది.

కేఎల్‌యూలో జాతీయస్థాయి చిత్ర మేళ



చిత్ర మేళాలో పాల్గొన్న వివిధ యూనివర్శిటీల విద్యార్థులు

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఫిల్మ్ టిక్నాలజీ క్లబ్ ఆధ్వర్యంలో చిత్ర మేళను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు పాల్గొని, తాము రూపొందించిన షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీ, రీల్స్ తయారీ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా తెలుగు చిత్ర పరిశ్రమ అసిస్టెంట్ డైరెక్టర్ కడ్డాల కల్యాణ్ విచ్చేసి మాట్లాడారు. రాబోయే రోజుల్లో చిత్రపరిశ్రమకు మంచి భవిష్యత్తు ఉందని, ఎవరికైతే చిత్ర పరిశ్రమపై ఇష్టం, అభిరుచి ఉంటుందో వారు సినీ రంగంలోకి రావడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అలాంటి వారికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ డైరెక్టర్ పి.సాయి విజయ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో విద్యార్థులకు చిత్ర పరిశ్రమలో మంచి అవకాశాలు లభిస్తున్నందున నటనపై ఆసక్తి ఉన్నవారు ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని సూచించారు. అనంతరం అత్యంత కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. షార్ట్ ఫిల్మ్ విజేతలు మార్పు అనే అంశంపై విజ్ఞాన యూనివర్శిటీ విద్యార్థులు ప్రథమ బహుమతిని గెలుచుకోగా, ద్వితీయ బహుమతిని కేఎల్‌యూ, తృతీయ బహుమతిని నిట్ తాడేపల్లిగూడెం విద్యార్థులు గెల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ప్రసాద్, విద్యార్థి సలహాదారు ఖాన్, అసోసియేట్ డీన్‌లు శ్రీధర్, పావని, వర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీలు ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి కేఆర్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పార్టీ కోసం పనిచేద్దాం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు

మేడికొండూరు: అందరం కలిసి పార్టీ కోసం పని చేద్దామని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు కోరారు. మండలంలోని పాలడుగు, సిరిపురం, మందపాడు గ్రామల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రజలు తమ డైరీలో రికార్డు చేసుకుంటున్నారని, తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆర్బీకే లను నిర్వీర్యం చేసిన కారణంగా నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు వచ్చాయని విమర్శించారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరి కష్ట, సుఖాల్లో తాను తోడునీడగా ఉంటానని, పార్టీని మరింతగా పటిష్ట పరిచేందుకు గ్రామ, మండల కమిటీలను నియామకం త్వరలో అందరి ఆమోదంతో జరుగుతుందని వెల్లడించారు. మండల పార్టీ అధ్యక్షుడు తాళ్లూరు వంశీకృష్ణ, బొడ్డు పెద్ద సాంబయ్య, బొడ్డు చిన్న సాంబయ్య, సర్పంచ్ వాడపర్తి భారతి, పేరం సాయి శౌరెడ్డి పాల్గొన్నారు.